క్లుప్తంగా

పురుగుల మందుల దుకాణంలో చోరీ

పర్చూరు (చినగంజాం): ఓ పురుగుమందుల దుకాణంలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. పర్చూరు–చీరాల రోడ్డులోని ఎరువులు దుకాణంలో గుర్తు తెలియని దుండగులు రూ.96 వేల నగదు దొంగిలించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో దుకాణానికి వెనుక వైపు ఉన్న ఎగ్జాస్ట్ ఫ్యాన్ ద్వారా గోడను పగులగొట్టి లోనికి ప్రవేశించి నగదు దోచుకెళ్లారు. మరునాడు షాపు తెరచేందుకు వచ్చిన యజమానులు షాపులో దృశ్యం చూసి ఆశ్చర్యానికి గురై తేరుకొని షాపును పరిశీలించగా అందులో ఉంచిన రూ.96 వేలు నగదు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై సురేష్ రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. అక్కడి సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించడం ద్వారా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

యద్దనపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పులగం రజనీ అధ్యక్షతన రేపు బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ కృష్ణ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.

దత్త మండప నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న కమిటీ సభ్యులు

వేటపాలెం: స్థానిక కొత్తపాలెం రోడ్డులో దత్తక్షేత్రంలో షోడశ దత్తావతార మండపం నిర్మాణం కోసం సోమవారం వైభవంగా భూమిపూజ నిర్వహించారు. అనంతరం క్షేత్రంలో 18 అడుగుల ఎత్తుతో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి అమ్మవారి స్థూపాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో క్షేత్ర కన్వీనర్ కే ప్రమీల దేవి, అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, కార్యదర్శి నున్నా శివ ప్రసాదరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ఠలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పర్చూరు (చినగంజాం): నూతనంగా ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం పర్చూరు మండలంలోని మండలంలోని ఇనగల్లు గ్రామంలో సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. గ్రామంలో భక్తులు, వారి బంధువులతో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరిశెట్టి విపిన్‌బాబు, ఆలయ కమిటీ సభ్యులు నరిశెట్టి వెంకట రమణ, శ్రీనివాసరావు, రాంబాబు, వీరభద్రరావు, వెంకటేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళికతో బోధన మెరుగు



మాట్లాడుతున్న ఎంఈవో సుధాకర్

అద్దంకి: ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్య ప్రణాళికను దగ్గర ఉంచుకుని విద్యా బోధన చేయాలని ఎంఈవో బీ సుధాకర్ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌రోల్‌మెంట్ ప్రకారం విద్యార్థులందరూ పాఠశాలలో ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. అకడమిక్ గ్రేడింగ్ రిజిస్టర్ ప్రతి పాఠశాలలో ఉండాలన్నారు. విద్యాప్రవేశ్ 90 రోజుల కార్యక్రమంలో భాగంగా 1వ తరగతి విద్యార్థులను సంసిద్ధులు చేయాలని చెప్పారు. 2026–27 నాటికి 6 నుంచి 8 సంవత్సరాలు పిల్లలకు పూర్తిగా సర్వతో ముఖాభివృద్ధి జరగాలని చెప్పారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ పీ. గంగాధర్, సీఆర్‌పీ, రమేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





కొరిశపాడు మండలంలో సాగు చేస్తున్న జొన్నపైరు

జొన్న ఆరోగ్యంలో మిన్న

- జొన్న సాగు వైపు రైతన్న చూపు
- చక్కెర రోగులకు ఆరోగ్యప్రదాయని
- నియోజకవర్గంలో 135 ఎకరాల్లో సాగు
- సిరిధాన్యాల వైపు చూస్తున్న జనం



పీ.శ్రీనివాసరావు
వ్యవసాయాధికారి

మేదరమెట్ల: ఒకప్పుడు వరికి అంత ప్రాధాన్యం లేని రోజుల్లో సిరి ధాన్యాలైన రాగులు, కొర్రలు, జొన్నలు, ఆరికలు, సామలు తదితర ఆహారధాన్యాలను సమృద్ధిగా తినేవారు. దీంతో ప్రజల శరీరం దృఢంగా ఉండేది. ఎటువంటి రోగాలు దరిచేరివి కాదు. కాల క్రమేణా వ్యవసాయంలో పురుగుమందుల వాడకం ఎక్కువడంతో రోగాల బారిన పడుతున్నారు. వరి విస్తీర్ణం పెరగడంతో సిరిధాన్యాల వాడకం తగ్గింది. ఫలితంగా షుగర్, బీపీ తదితర రోగాలతో జనం సతమతం అవుతున్నారు. మళ్లీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం సిరిధాన్యాల వైపు మొగ్గుచూపుతున్నారు.

ఆరోగ్య ప్రదాయనిగా జొన్న..

రైతులు ఇప్పటివరకు సాగు చేసిన పలు రకాల పంటలకు సరైన దిగుబడులు రాకపోవడం, వచ్చిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడం వంటి పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో జొన్న పంటను సాగు చేసేందుకు రైతన్నలు మొగ్గుచూపుతున్నారు. ఒక వైపు తక్కువ పెట్టుబడితో పండించే పంటగా, ఎక్కువ పోషకాలు కలిగిన పంటగా మరోవైపు చక్కెర రోగులకు దోహదపడుతుంది. జొన్నను పండించడం వలన రైతులకు ఆదాయ వనరులు సమకూరుతాయని, ఈ పంటను పండించేందుకు అధిక శాతం రైతులు ముందుకు రావాలని వ్యవసాయాధికారి పీ.శ్రీనివాసరావు సూచిస్తున్నారు. నియోజకవర్గంలో పమిడిపాడు, బొద్దువానిపాలెం, తిమ్మాయపాలెం, గార్లపాడు, ఏల్చూరు, కొమ్మాలపాడు తదితర గ్రామాల్లో సుమారు 135 ఎకరాల్లో జొన్న పంటను సాగుచేస్తున్నారు.

ఏ నేలలు బాగుంటాయంటే.. !

తేలికపాటి నేలలు, నల్లరేగడి, ఎర్రనేలలు అనుకూలం.

ఎంత విత్తనం వాడాలంటే.. !

ఎకరాకు 5 నుంచి 8 కిలోల వరకు విత్తుకోవచ్చు

విత్తన రకాలు..

సీఎస్‌హెచ్ 14,15,16, నంద్యాల పచ్చజొన్న, నంద్యాల తెల్లజొన్న, కిన్నెర రకాలు ఈ నేలలకు అనుకూలం.

విత్తన శుద్ధి..

జొన్నను విత్తుకునే ముందు బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలి.

నీటి యాజమాన్యం..

పంట నాలుగు కీలక దశల్లో తేలిక తడులు ఇవ్వాలి. ముఖ్యంగా గింజ పాలుపోసుకునే సమయంలో తప్పనిసరిగా నీరు అందిచాలి.

అంతర కృషి..

జొన్న విత్తిన 30 రోజులకు గుంటకతో కాని దంతెలతో కానీ అంతర కృషి చేయాలి. జొన్న విత్తిన 35, 40 రోజుల వయస్సు ఉన్న సమయంలో మల్లెవస్తుంది. దీన్ని నివారించుకోవాల్సి ఉంటుంది.

సస్యరక్షణ, మొవ్వ తొలుచు ఈగ..

పురుగు ఆశించినట్లైతే మొవ్వ ఎండిపోతుంది. మొక్క వయస్సు ఐదు వారాలు వచ్చే వరకు ఈ పురుగు మొక్కను ఆశిస్తూ ఉంటుంది. దీని నివారణకు ఎకరాకు 2 లేదా 3 క్వింటాళ్ల వేపపిండిని దుక్కిలో వేసుకొని బాగా కలియదున్నుకోవాలి. పొలం గట్లపై కలుపు లేకుండా చూసుకోవడం, అగ్ని అస్త్రం ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. జిగురు పూసిన తెలుపు, పసుపు రంగు పళ్లేలను ఎకరాకు 20 చొప్పున అమర్చుకోవాలి. బంతి, ఆముదం మొక్కలను ఎరపంటలుగా వేసుకోవాలి.

కాండం తొలిచేపురుగు..

పైరు నెలరోజుల వయస్సు వచ్చిన తరువాత నుంచి పంట చేతికి వచ్చేవరకు ఈ పురుగు పంటను ఆశిస్తుంది. దీనివలన మొవ్వ చనిపోయి తెల్ల కంకి ఏర్పడుతుంది. దీని నివారణకు లింగాకర్షణ బుట్టలు అమర్చుకోవాలి. వేపకషాయం, అగ్నాస్త్రం పిచికారీ చేసుకోవాలి.

తెగుళ్ల నివారణ..

బూజు తెగులు, బంకకారే తెగులు నివారణకు పేడ మూత్రం, ఇంగువ ద్రావణాన్ని పది రోజుల వ్యవధిలో రెండు దఫాలుగా పిచికారీ చేసుకోవాలి.

దిగుబడి..

ఎకరాకు సరాసరిన 4, 5 క్వింటాళ్ల పంట చేతికి వస్తుంది. క్వింటా ధర రూ.5500 పైనే ఉన్నందువలన ఎకరాకు సుమారు రూ.25 వేల వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుత సమాజంలో ఎక్కువ శాతం ప్రజలకు చక్కెర వ్యాధితో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ఈవ్యాధిని తగ్గించుకునేందుకు జొన్న రొట్టెలు, జొన్న జావ, తదితర పదార్థాలను ఎక్కువగా వినియోగించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

జొన్న వాడకంతో ఎన్నో ప్రయోజనాలు..



ఇటీవల కాలంలో ఎక్కువ మంది షుగర్ రోగులు తరచుగా జొన్నలతో తయారు చేసుకున్న ఆహారాన్ని తీసుకుంటున్నారు. అధిక పోషకాలు కలిగిన జొన్నలను వినియోగించడం వలన ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. దీనిలో ప్రోటీన్లు, పీచుపదార్థాలు ఎక్కువ. గుండె సంబధిత వ్యాధులు రాకుండా, జీర్ణవ్యవస్థ సక్రమంగా ఉండేందుకు అంతే కాకుండా ఉదర సమస్యలు రాకుండా ఉండేందుకు కూడా జొన్నలు ఉపయోగపడతాయి. త్వరగా జీర్ణమయ్యే స్వభావం కూడా దీనిలో ఉంది.

– డాక్టర్ నిఖిలారెడ్డి, వైద్యాధికారిణి

తక్కువ ఖర్చు అయ్యే పంట..



జొన్న పంటను సాగు చేయడం ఎంతో సులువుగా ఉంటుంది. తక్కువ పెట్టుబడి, తక్కువ నీరు వినియోగించి జొన్న పంటను సాగు చేసుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడిని తీసుకోవచ్చు. అంతే కాకుండా ఇటీవల కాలంలో ఎక్కువ మంది ఆరోగ్య సూత్రాలను పాటించడం వలన జొన్నల వినియోగం పెరిగింది. గిరాకీ కూడా ఉండటంతో సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– వై.నాగిరెడ్డి, రైతు మేదరమెట్ల

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అపోహలు వీడాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్సై సురేష్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు

మేదరమెట్ల: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అపోహలు అనుమానాలపై ప్రజలకు అవగాహన కలిగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కొరిశపాడు ఎస్సై వై సురేష్ పేర్కొన్నారు. సోమవారం బాపట్ల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ మేదరమెట్ల ఆధ్వర్యంలో కొరిశపాడు పోలీసు స్టేషన్‌లో 'మీకు తెలుసా' అవగాహన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలకు పైగా ప్రజలను పట్టి పీడిస్తున్న హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి మహమ్మారిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలంటే గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థ టీఐ ప్రాజెక్టర్ సాగర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నా ఉద్దేశంతో 8 వారాలపాటు కార్యక్రమం రూపొందిచామన్నారు. కార్యక్రమంలో హెల్ప్ టీఐఎంఈ భార్గవ్, ఓఆర్‌డబ్ల్యూ కృష్ణవేణి, పీఈలు సువార్త, శారద పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విఖనస మహర్షి జయంతి



విఖనసాచార్యుని నగరోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: శ్రావణ పౌర్ణమి, విఖనస మహర్షి జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక సంతబజారులోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, విశేష అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా చీరాల డివిజన్ పరిధిలోని చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతీయ వైఖానస సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సభను పేరాలలోని తేలప్రోలు వీరయ్య, వెంకాయమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి రావులకొల్లు పరాంకుశం వెంకట రంగాచార్యులు అధ్యక్షతన వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తిరుపతి వెంకటేశ్వర వేదిక్ యూనివర్శిటి అసిస్టెంట్ ప్రొఫెసర్ రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో చీరాల డివిజన్ అధ్యక్షులు రావులకొల్లు పరాంకుశం వెంకట రంగాచార్యులు, ప్రధాన కార్యదర్శి నారాయణం శ్రీనివాసాచార్యులు, కోశాధికారి వినుకొండ వెంకట ఫణీంద్రకుమార్, చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలలోని వైఖానస సంఘీయులు పాల్గొన్నారు.

వెద పద్ధతిలో తక్కువ సాగు ఖర్చు



రైతులుకు సాగు పద్ధతులను వివరిస్తున్న ఏడీఏ మోహనరావు

పర్చూరు(చినగంజాం): వెద పద్ధతిలో రైతులు వరి సాగు చేపడితే సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్ మోహనరావు తెలిపారు. మండలంలోని కొత్తపాలెం, చెరుకూరు, రమణాయపాలెం గ్రామాల్లోని వరి పొలాలను, రైతు సేవాకేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. వెద పద్ధతిలో ఎకరానికి 15 కిలోల విత్తనాలు సరిపోతాయని, ఈ విధానంలో వెద పెట్టిన వెంటనే కలుపు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఎకరానికి 400 మి.లీ ప్రెటిలాక్లర్ కలుపు మందును పిచికారీ చేయాలని తెలిపారు. వరిపైరు వేసిన 25 రోజుల అనంతరం ఎకరానికి 100 మి.లీ నామిని గోల్డ్ కలుపు మందును పిచికారీ చేయాలన్నారు. ఈ విధానంలో పైరు 10 రోజుల ముందే కోతకు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, సిబ్బంది

మార్టూరు: ప్రస్తుతం వేసవిని తలపిస్తున్న తీవ్ర వర్షాభావ పరిస్థితులపై పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల డాట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ మురళీధర్ నాయక్ అన్నారు. మండల కేంద్రం మార్టూరులో సోమవారం సాయంత్రం ఆయన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జే రాధాకృష్ణ, ఏడీఏ కేవీ శ్రీనివాసరావులతో కలిసి పత్తి పంటలను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో వీ. కిరణ్ కుమార్, ఏఈవో మౌలాలి, వీపీఏ అమల, వీహెచ్ఏ సువర్చల, రైతులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో బోనాల పండుగ



కూరగాయలతో అలంకరణలో సాయినాథుడు

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలో షిర్డి సాయిబాబా మందిరంలో సోమవారం బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిరిడిలో సాయినాథుడి పాదుకలు ప్రతిష్ఠించిన రోజు, శ్రావణ పౌర్ణమి సందర్భంగా సాయిబాబాకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయినాథుడికి శాకాంబరి అలంకారం, 116 మంది మందితో బోనాల ఊరేగింపు మహోత్సవం నిర్వహించారు. వివిధ రకాల పూలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

శింగరకొండ దేవస్థానానికి జనరేటర్ అందజేత



జనరేటర్‌ను ప్రారంభిస్తున్న దాతలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానానికి రూ. 7 లక్షలు విలువ గల 125 కేవీ జనరేటర్‌ను కూకట్ల సుబ్బారావు, వింజావళి కుమారుడు కూకట్ల శ్రీనివాసరావు, తానా ఫౌండేషన్ ట్రస్ట్, ఉత్తర అమెరికా యూఎస్ఏ అందజేసి ప్రారంభించారు. జనరేటర్‌కు సంబంధించిన ప్యానెల్ బోర్డును రూ. 5 లక్షలతో నరసరావుపేట మండలం కాకానికి చెందిన శ్రీదండ బ్రహ్మనందం, లక్ష్మీరాజ్యం అందజేశారు. జనరేటర్‌కు షెడ్ నిర్మాణాన్ని దేవస్థాన నిధులతో నిర్మించారు. కార్యక్రమంలో దేవస్థాన ఏసీ టీ.సుభద్ర, దాతలు పాల్గొన్నారు.

విద్యార్థి మేధస్సుకు ప్రతిభా పరీక్ష



విద్యార్థి విజ్ఞాన్ మంథన్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

చీరాల అర్బన్: కేంద్ర ప్రభుత్వ సంస్థలైన జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ, విజ్ఞాన భారతి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పరీక్ష విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2024–25 సంవత్సరం బ్రోచర్‌ను సోమవారం కొత్తపేటలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జోనల్ కో–ఆర్డినేటర్ పవని భాను చంద్రమూర్తి, హెచ్ఎం జి.శ్రీనివాసరావు, కౌశల్ కో–ఆర్డినేటర్ పి.పూర్ణచంద్రరావులు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల నుంచే లేదా ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ విధానంలో పరీక్ష రాయవచ్చన్నారు. 6 నుంచి 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. గణితం, సైన్స్, విద్యార్థి విజ్ఞాన్ మంథన్ నిర్దేశించిన స్టడీ మెటీరియల్ ఆధారంగా పరీక్ష రాయవచ్చన్నారు. అక్టోబర్ 23, 27 తేదీల్లో ఒక రోజు పరీక్ష ఉంటుందన్నారు. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి పురస్కారాలు ఉంటాయన్నారు. పరీక్ష ఫీజు రూ.200 సెప్టెంబర్ 15 తేదీలోపు కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

స్థాయికి అనుగుణంగా బోధన అవసరం



స్వర్ణ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు



కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

జే.పంగులూరు: విద్యార్థుల స్థాయిని గుర్తించి దానికి అనుగుణంగా విద్యాబోధన చేయాలని ఎంఈఓ వీరాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం నూజిళ్లపల్లి పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడు ఉన్ కైలాష్‌బాబును చందలూరు హైస్కూల్‌కు గణిత ఉపాధ్యాయుడిగా, తూర్పు కొప్పెరపాడు పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా పనిచేసే ఏ కోటేశ్వరమ్మను చందలూరు హైస్కూల్ సోషల్ టీచర్‌గా, ముప్పవరం పని చేసే బత్తుల పాపారావును పంగులూరు హైస్కూల్ సోషల్ టీచర్‌గా సర్దుబాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐ అనిత, ఉపాధ్యాయులు, తదితరులు హాజరయ్యారు.

స్వర్ణ (కారంచేడు): ఉపాధ్యాయుల ప్రతిభకు పదును పెట్టడం కోసమే కాంప్లెక్స్‌ల సమావేశాలు నిర్వహిస్తున్నామని ఎంఈఓ మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని స్వర్ణ ఉన్నత పాఠశాల ఆవరణలో కాంప్లెక్స్ చైర్మన్ ఎంవీ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కాంప్లెక్స్‌కు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

నేరాలను అదుపు చేయడమే లక్ష్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకట్రావు

ఆదిపూడి (కారంచేడు): గ్రామీణ ప్రాంతాల్లో నేరాలను అదుపు చేయడంతో పాటు, నేరాల శాతం తగ్గించడమే లక్ష్యంగా తమ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని ఎస్సై వీ వెంకట్రావు అన్నారు. సోమవారం రాత్రి ఆయన మండలంలోని ఆదిపూడి గ్రామంలో ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రధానంగా గంజాయి, అక్రమ మద్యం వినియోగం, జూదం, పేకాటలు, కోడపందేలు వంటివి నిషేధమన్నారు. కొంత మంది కాలక్షేపం కోసం చేస్తుంటారని, మరికొంత మంది యువత ఇలాంటి వాటికి బానిసలుగా మారుతున్నారన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. గ్రామాల్లో సైతం నిరంతర నిఘా పెంచేలా సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ బంధానికి రక్ష రాఖీ



యద్దనపూడిలో తమ సోదరులకు రాఖీ కడుతున్న సోదరి

యద్దనపూడి: శ్రావణమాస శుద్ధ రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి సందర్భంగా సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నలకు చెల్లెళ్లు, తమ్ముళ్లకు అక్కలు రాఖీని కట్టి ప్రేమానుబంధాన్ని చాటారు. మిఠాయిలు తినిపించి దీవెనలు పొందారు. చిన్నపెద్దా అని తేడా లేకుండా అంతా సందండి చేశారు. కష్టాల్లో తోడుగా ఉంటామని ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.

లారీ యజమానుల సంఘంపై ఫిర్యాదు

చీరాల: చీరాల లారీ యజమానుల సంఘం అక్రమాలపై లారీ యజమాని వల్లెపు బాల అలంమ్మరావు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమాలపై తాను ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని వివరించారు. స్పందించిన కలెక్టర్ ఫిర్యాదుపై మూడు రోజుల్లో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని చీరాల ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డిని ఫోన్‌లో ఆదేశించారు.

ఆంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ దేవస్థానంలో ప్రసన్నాంజనేయ స్వామికి పౌర్ణమి సందర్భంగా సోమవారం లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయాన్నే స్వామివారికి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 11 ఆవృత్తాలుగా దేవస్థాన పండితులు, అర్చకులు లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. స్వామివారికి మహానివేదన, పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉభయదాతలు ఒంగోలుకు చెందిన శ్రీనివాసరావు, దేవస్థాన ఏసీ సుభద్ర, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం

చినగంజాం: మండలంలోని భూ సమేత భావన్నారాయణ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కళ్యాణ కార్యక్రమాన్ని విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు జీ పిచ్చయ్య నిర్వాహణలో వేద పండితులు పరాశరం రామాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణాన్ని తిరుమల సంప్రదాయరీతిలో నిర్వహించారు.